ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.6 కనిష్ఠం 24.1



4న ఉమ్మడి జిల్లాల సబ్‌జూనియర్ ఖోఖో పోటీలు

సుభాష్‌నగర్, ఆగస్టు31: ఉమ్మడి జిల్లాల సబ్‌జూనియర్ బాలబాలికల ఖోఖో పోటీలు సెప్టెంబర్ 4న నిర్వహిస్తున్నట్లు జిల్లా ఖోఖోఅసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు భూమారెడ్డి, అతీక్ ఉల్లా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డిలోని పాల్వంచ జెడ్పీహెచ్ఎస్ మైదానంలో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పాల్గొనే క్రీడాకారులు ఒరిజినల్ బొనాఫైడ్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్టు సైజ్‌ఫొటోలు తీసుకురావాలని, పాల్గొనేజట్లు సెప్టెంబర్ 2న సాయంత్రం 5వరకు ఖోఖో అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ నాగేశ్వర్‌రావును సంప్రదించాలని కోరారు.



- డిమాండ్ ఉన్న పంటలకే మొగ్గు చూపిన జిల్లా రైతులు
- ప్రభుత్వం బోనస్ ప్రకటనతో పెరిగిన సన్నరకాల సాగు
- జిల్లాలో 5.35లక్షల ఎకరాల్లో సాగు
- సర్వే నెంబర్ల ఆధారంగా పంటల వివరాల సేకరణ
- కొనుగోలుకు అధికారుల ప్రణాళిక



● డొంకేశ్వర్‌లో సాగవుతున్న వరి



● అంకాపూర్‌లో సాగవుతున్న మొక్కజొన్న

పెరిగిన పంటల సాగు!

నిజామాబాద్, ఆగస్టు31 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో వానాకాలం సాగువిస్తీర్ణం పెరిగింది. జిల్లావ్యాప్తంగా రైతులు పెద్దఎత్తున పంటలను సాగుచేశారు. జూన్‌లో వర్షాలు అంతంతమాత్రమే పడినా జూలై, ఆగస్టు నెలల్లో ఎక్కువ మొత్తంలో వర్షాలు పడటంతో రైతులు వరితోపాటు మొక్కజొన్న, సోయా, పసుపు ఇతర పంటలను సాగు చేశారు. అయితే జిల్లాలో అత్యధికంగా వరి సాగవుతోంది. బోర్లకిందనే కాకుండా నిజాంసాగర్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుల పరిధిలోని ఆయకట్టుతోపాటు గుత్ప అలీసాగర్‌ఎత్తిపోతల పథకాల కింద ఈపంటలను వేశారు. జిల్లా వ్యాప్తంగా వేసిన పంటల సాగువివరాలను వ్యవసాయ అధికారులు సేకరించారు. సర్వేనెంబర్ల ఆధారంగా పంటల వివరాలను తీసుకోవడంతోపాటు ప్రత్యేక యాప్‌లో నమోదు చేసి ప్రభుత్వానికి పంపించారు. ఇప్పటికే జిల్లాలో 40వేల మెట్రిక్‌టన్నుల వరకు యూరియాను రైతులు కొనుగోలు చేసినట్లు వ్యవసాయ అధికారులు అంచనావేస్తున్నారు.

జిల్లాలో 5.35 లక్షల ఎకరాల్లో సాగు

జిల్లాలో వానాకాలం సాగు గణనీయంగా పెరిగింది. సాగు అదను దాటడంతో ఈ వానాకాలంలో వేసిన పంటల వివరాలను జిల్లా వ్యవసాయ అధికారులు సేకరించారు. ప్రభుత్వానికి నివేదిక పంపించారు. జిల్లాలో 5లక్షల 35వేల 160 ఎకరాల్లో పంటల సాగయ్యాయి. జూన్ నుంచి ఆగస్టువరకు రైతులు ఈ పంటలను వేశారు. మొదట ఆరుతడి పంటలను సాగుచేసిన రైతులు జూలై నుంచి వరిసాగును మొదలు పెట్టారు. జిల్లాలో ఈ ఏడాది కూడా రైతులు ఎక్కువమొత్తంలో మొక్కజొన్న, వరిసాగు వైపు మొగ్గుచూపారు. గత కొన్నేళ్లుగా భారీ వర్షాల కారణంగా రైతులు సోయాపంటను తగ్గిస్తున్నారు. ఈ ఏడాది కూడా సోయాకు బదులుగా మొక్కజొన్న, వరిసాగుకే మొగ్గు చూపారు. జిల్లా వ్యాప్తంగా సర్వే నెంబర్ల ఆధారంగా అన్ని గ్రామాల పరిధిలో వేసిన పంటల వివరాలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు క్లస్టర్ల వారిగా సేకరించారు. పంటల విస్తీర్ణం ఆధారంగా అధికారులు ఎరువులను సమకూర్చారు. పంటల సాగు ఆధారంగా ఉత్పత్తులను కొనుగోలు చేయాల్సి ఉండటంతో ముందస్తుగా ఈ వివరాలను సేకరించారు. ప్రభుత్వానికి నివేదికను పంపించారు. జిల్లాలో వేసిన పంటల ఆధారంగా ఎంతదిగుబడి వస్తుందో అంచనావేసి ఆయా మార్కెట్‌లో అమ్మకాల కోసం ఏర్పాట్లను చేయనున్నారు. మార్క్‌ఫెడ్, పౌరసరఫరాల ద్వారా ఈ ఉత్పత్తులను కొనుగోలు చేయనున్నారు.

4.25 లక్షల ఎకరాల్లో వరి

జిల్లాలో అత్యధికంగా వరి పంట సాగవుతోంది. 4లక్షల 25వేల 133 ఎకరాల్లో రైతులు పంటను వేశారు. వ్యవసాయ శాఖ వేసిన అంచనాకు మించి జిల్లాలో వరిసాగును రైతులు చేపట్టారు. జూన్‌లో భూగర్భజలాలు తక్కువగా ఉన్నా బోర్ల కింద నారుమళ్లు సిద్ధం చేసుకున్న రైతులు జూలై నుంచి వర్షాలు పడుతుండటంతో ఎక్కువ మొత్తంలో ఈ పంట సాగు చేశారు. బోధన్ పరిధిలోని వర్ని, మోస్రా, చందూర్, రుద్రూర్, కోటగిరి, నవీపేట, ఎడపల్లి మండలాల్లో ముందస్తుగానే వరినాట్లను వేశారు. బోర్లను వినియోగించడంతోపాటు నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయడంతో రైతులు ఎక్కువ మొత్తంలో ఈ వరిపంటను వేశారు. జిల్లాలో గత కొన్నేళ్లుగా సన్నరకాల సాగును రైతులు పెంచుతున్నారు. జిల్లాలోని వ్యాపారులు, మిల్లర్లతోపాటు రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుంచి వచ్చి కొనుగోలు చేస్తున్నారు.

65 శాతానికి పెరిగిన సన్నరకం

ఐదేళ్ల క్రితం వరకు జిల్లాలో సన్నరకం సాగు 30శాతంలోపు ఉండగా ప్రస్తుతం ఈ సీజన్‌లో 65 శాతానికి పైగా పెరిగినట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో ఈ వానాకాలంలో సాగు అయిన మొత్తం విస్తీర్ణంలో 3లక్షల 20వేల ఎకరాలకు పైగా సన్నరకాలను వేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ముందస్తుగా సాగుచేసిన రైతులకు వ్యాపారులు క్వింటాలు 2300 నుంచి 2600 వరకు ధర పెట్టి కొనుగోలు చేస్తుండటంతో ఎక్కువగా ఈ పంటను వేశారు. గత కొన్నేళ్లుగా సన్నరకాలకు దిగుబడి కూడా ఎక్కువగా వస్తుండటంతో ఎకరాకు 30 క్వింటాలకు పైగా వస్తుండటంతో రైతులు ఈ పంటను వేస్తున్నారు. పంట కాలం దొడ్డురకాలతో పోలిస్తే 20రోజులు ఎక్కువగా ఉన్న ఈ పంటకే ఎక్కువగా మొగ్గుచూపారు. దొడ్డురకాలను కూడా కొన్నిప్రాంతాల్లో ఎక్కువగా రైతులు వేశారు. బోర్ల కింద ఈ రకాన్ని ఎక్కువగా సాగు చేశారు. సన్నరకాలతో పోలిస్తే దొడ్డు రకాలకు నీటి అవసరం తక్కువగా ఉండటం వల్ల ఈ పంటను వేశారు.

రూ.500 బోనస్‌తో పెరిగిన వరిసాగు

కాంగ్రెస్ ప్రభుత్వం క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామనడంతో దొడ్డు రకం సాగు ఎక్కువైనట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనావేశారు. వరిసాగు పెరగడంతో ఎరువుల వినియోగం కూడా ఎక్కువైంది. జిల్లాలో ఇప్పటి వరకు 40వేల మెట్రిక్ టన్నుల వరకు యూరియా వినియోగం అయినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఇతర జిల్లాలతో పోలిస్తే జిల్లాలో ఎరువుల వాడకం కూడా ఎక్కువగా ఉంది. వరిసాగుకు డీఏపీ ఒకసారి దుక్కిలో వేస్తున్న రైతులు నాలుగువిడతల్లో యూరియాను వినియోగిస్తున్నారు. నానో యూరియా వచ్చిన రైతులు ఎక్కువగా మొగ్గు చూపడంలేదు. జిల్లాలో వరిసాగు తర్వాత రైతులు ఎక్కువగా మొక్కజొన్న సాగుకే మొగ్గు చూపారు. ఈ వానాకాలం 49వేల 65 ఎకరాల్లో ఈ పంటను వేశారు. గతంలో తక్కువగా ఈ పంటను వేసిన రైతులు ప్రస్తుతం మద్దతు ధరకు మించి మొక్కజొన్నకు డిమాండ్ వస్తుండటంతో ఎక్కువగా సాగు చేశారు. సోయాకు డిమాండ్ ఉన్న దిగుబడి రాకపోవడంతో ఎక్కువ మంది రైతులు మొక్కజొన్న సాగుకు మొగ్గు చూపారు. మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేస్తుండగా వ్యాపారులు కూడా ఎక్కువ మంది వచ్చి రైతుల దగ్గర కొనుగోలు చేస్తుండటంతో ఈ సాగును ఎక్కువగా పెంచారు. జిల్లాలో సోయాబీన్ ఐదేళ్ల క్రితం లక్ష ఎకరాల వరకు సాగు చేయగా ప్రస్తుతం భారీగా తగ్గించారు. జిల్లాలో ప్రస్తుతం 34వేల 733 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఈ పంటకు దిగుబడి తగ్గడం ధర ఉన్నా వర్షాలు ఎక్కువ పడితే పంట నష్టపోతుండటంతో రైతులు సాగును తగ్గించారు. గత కొన్నేళ్లుగా పసుపుకు ధర లేక రైతులు ఆ పంట సాగును తగ్గించారు.

పసుపు వైపు మొగ్గు చూపని రైతులు

గత సంవత్సరం పసుపునకు డిమాండ్ పెరిగినా ఈ ఏడాది సాగుకు రైతులు మొగ్గు చూపలేదు. గతేడాది కంటే కేవలం 3వేల ఎకరాలు మాత్రమే ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఈ వానాకాలం 22వేల 342 ఎకరాల్లో ఈ పంటను చేస్తున్నారు. ధర బాగా ఉన్నా రైతులు మాత్రం పంటకు మొగ్గు చూపలేదు. ఈ పంటలతో పాటు పెరస, మినుము, కందితోపాటు ఇతర పంటలను రైతులు కొంత విస్తీర్ణంలో వేశారు. జిల్లాలో వానాకాలం పంటలు వేసే సమయం ముగియడంతో వ్యవసాయ అధికారులు కూడా ఈ వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదించారు. వానాకాలం సీజన్‌లో వరి దిగుబడిని అంచనా వేసి జిల్లాలో కొనుగోలు కేంద్రాలను పౌరసరఫరాల శాఖ ద్వారా ఏర్పాటు చేయనున్నారు. ధాన్యం కొనుగోలుతో పాటు మిల్లర్లకు కేటాయించడం, గోదాంలలో పెట్టడం కీలకం కావడంతో ముందస్తుగా సాగు విస్తీర్ణాన్ని అధికారులు సేకరించారు. ఈ వివరాల ఆధారంగానే ధాన్యంతో పాటు మొక్కజొన్న, సోయా, పసుపు కొనుగోలు కోసం ప్రభుత్వం ఏర్పాట్లు చేయనుంది. పంటచేతికి వచ్చే సమయానికే కొనుగోలు కోసం ఏర్పాట్లను చేయనుంది. జిల్లాలో సాగు విస్తీర్ణం పెరిగిందని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి వాజిద్ హుస్సేన్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పంటల సాగువివరాలను సేకరించినట్లు తెలిపారు.

వ్యాధుల నియంత్రణే లక్ష్యంగా పని చేయాలి

- క్షేత్రస్థాయి అధికారులతో వీసీలో కలెక్టర్
- అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు



● వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్



● వీసీలో పాల్గొన్న అధికారులు

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 31: సీజనల్ వ్యాధుల నియంత్రణే లక్ష్యంగా అంకితభావంతో కృషి చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు క్షేత్రస్థాయి అధికారులకు ఆదేశించారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుంచి కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా మండలాల ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. జిల్లాలో ఎక్కడ కూడా డెంగ్యూ, చికున్‌గున్యా, మలేరియా, టైఫాయిడ్, విష జ్వరాలు వంటి వ్యాధులు ప్రబలకుండా క్షేత్రస్థాయిలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా డెంగ్యూ ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని పారిశుధ్య పనులు పక్కాగా నిరంతరం పర్యవేక్షణ చేయాలని దోమల నివారణకు అన్ని ప్రాంతాల్లో ఫాగింగ్ చేయాలన్నారు. నీరు నిల్వ ఉన్నచోట, మురికి కాల్వల్లో ఆయిల్‌బాల్స్ వేయాలని రోజువారిగా పీహెచ్‌సీల నుంచి సీజనల్ వ్యాధులకు సంబంధించిన కేసుల నమోదు వివరాలు తెప్పించుకొని ఎక్కడైనా డెంగ్యూ కేసులు నమోదైతే చుట్టుపక్కల అన్ని నివాసగృహాల వద్ద నియంత్రణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. టైటెక్స్, టెమిఫోస్, పైరిత్రాన్, మెలాదిన్ మందులను అన్ని గ్రామ పంచాయతీలలో అందుబాటులో ఉంచాలని వారానికి కనీసం రెండుపర్యాయాలు తప్పనిసరిగా పిచికారీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు మరింత ప్రబలే ఆస్కారం ఉందని, అక్టోబర్ వరకు అప్రమత్తతతో కూడిన చర్యలు చేపట్టాలని హితవు పలికారు. తాగునీరు కలుషితం కాకుండా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. వీసీలో అదనపు కలెక్టర్ అంకిత్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, ట్రైని కలెక్టర్ సంకేత్‌కుమార్, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

భారీ వర్ష సూచన నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

నిజామాబాద్ అర్బన్: రానున్న రెండురోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ రెడ్‌అలర్ట్ జారీ చేసిన నేపథ్యంలో అన్నిశాఖల అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఆదేశించారు. ఎక్కడ కూడా ప్రాణనష్టం, ఆస్తినష్టం సంభవించకుండా ముందస్తుగా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. భారీవర్షాల నేపథ్యంలో కలెక్టర్ శనివారం సాయంత్రం టెలికాన్ఫరెన్స్ ద్వారా రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, మున్సిపల్, ఆర్అండ్‌బి, విద్యుత్, ఆర్టీసి, ఇరిగేషన్, వైద్య ఆరోగ్య శాఖ తదితర శాఖల అధికారులతో సమీక్షించారు.

కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ రెడ్‌అలర్ట్ ప్రకటించిన నేపథ్యంలో సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సముదాయంలో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. భారీ వర్షాలతో జిల్లాలో ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే ప్రజలు కంట్రోల్ రూమ్ నెంబర్ 08462-220183 నెంబర్‌కు సమాచారం అందించాలని ఈ కంట్రోల్ రూమ్ 24గంటలపాటు పనిచేస్తుందన్నారు. కంట్రోల్‌రూమ్ ద్వారా సమాచార సేకరణ కోసం బృందాలను ఏర్పాటు చేశామన్నారు. నిజామాబాద్ రెవెన్యూ డివిజినల్ కార్యాలయంలోనూ కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసినట్లు ఆర్‌డీవో రాజేంద్రకుమార్‌తెలిపారు.

విద్యార్థి సంఘాల నాయకులతో మాట్లాడుతున్న ఏసీపీ





రక్షిత (ఫైల్‌ఫొటో)

రుద్రూర్‌లో కలకలం

- పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థిని ఆత్మహత్య
- బాత్‌రూమ్ గ్రిల్స్‌కు చున్నీతో ఉరివేసుకున్న విద్యార్థిని
- కళాశాలలో చేరిన నాలుగు రోజులకే ఆత్మహత్య
- తల్లిదండ్రులు రాక ముందే విద్యార్థిని మృతదేహం తరలింపు
- అడ్డుకున్న విద్యార్థి సంఘాలు
- ఘటనా స్థలాన్ని సందర్శించిన ఏసీపీ శ్రీనివాస్

రుద్రూరు, ఆగస్టు 31: పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థిని లింగావాడ్ రక్షిత (15) ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం రుద్రూరు మండలంలో కలకలం రేపింది. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం హస్నాపూర్ గ్రామానికి చెందిన లింగావాడ్ రక్షిత 4 రోజుల క్రితం రుద్రూరులోని అక్బర్‌నగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశం పొందింది. హస్టల్‌లో 4రోజుల పాటు అందరితో కలుగోపుగా ఉంది. శనివారం తెల్లవారు జామున బాత్‌రూమ్‌లోకి వెళ్లిన రక్షిత బాత్ గ్రిల్స్‌కు చున్నీ కట్టి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర కలకలం సృష్టించింది. ఎంతసేపటికీ రక్షిత బయటికి రాకపోవడంతో తోటి విద్యార్థులు ఆందోళనకు గురై విషయాన్ని వసతిగృహం ఇన్‌చార్జికి సమాచారం అందించారు. వసతిగృహం సిబ్బంది వెనుకవైపు నుంచి కిటికి అద్దాలు ధ్వంసం చేసి చూడగా అప్పటికే రక్షిత మృతిచెందింది. ఈవిషయమై పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి రుద్రూరు సీఐ జయేష్‌రెడ్డి, ఎస్సై సాయన్న చేరుకున్నారు. ఘటనాస్థలానికి వెళ్లిన సీఐ 2గంటల పాటు ఎవరినీ అనుమతించలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాల నాయకులు మృత దేహ తరలింపును అడ్డుకునే ప్రయత్నం చేశారు. తల్లిదండ్రులు రాకుండా మృతదేహాన్ని తరలించడం సరికాదని పోలీసులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. కళాశాల అధిపతి, వార్డెన్‌లు ఘటనకు బాధ్యత వహించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. వారిద్దరినీ సస్పెండ్ చేయాలని పట్టుబట్టారు. వార్డెన్, అధిపతిల నిర్లక్ష్యం విద్యార్థిని మృతికి కారణమని వారు ఆరోపించారు. దీంతో విద్యార్థి సంఘాలు, పోలీసులకు వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు విద్యార్థిని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం తల్లిదండ్రులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. తమ కూతురు ఆత్మహత్య చేసుకోవడంపై కళాశాల యాజమాన్యాన్ని వారు నిలదీశారు. ఆత్మహత్యకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

● సమగ్ర విచారణ చేపడతాం: ఏసీపీ

రుద్రూరు పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థిని ఆత్మహత్యపై సమగ్ర విచారణ జరుపుతామని ఏసీపీ శ్రీనివాస్ వెల్లడించారు. 4రోజుల క్రితం కళాశాలలో చేరిన విద్యార్థిని ఆత్మహత్య చేసుకునేందుకు గల కారణాలను అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తామన్నారు, వసతి గృహంలో ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలించారు. తొలిరోజు మాత్రమే సీసీ ఫుటేజీ ఉండగా మిగిలిన రెండు రోజుల సీసీ ఫుటేజీ లేకపోవడంతో నిపుణులను పిలిపించి సీసీ ఫుటేజీ రికార్డులను పరిశీలిస్తామన్నారు.

వచ్చే నాలుగు రోజులు..

భారీ వర్షాలు!

● రైతులు అప్రమత్తంగా ఉండాలని కోరిన వ్యవసాయ శాస్త్రవేత్తలు

నిజామాబాద్, ఆగస్టు31 (ఆంధ్ర జ్యోతి ప్రతినిధి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో జిల్లాలో నాలుగు రోజులపాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఈ వర్షాలు అన్ని మండలాల పరిధిలో పడే అవకాశం ఉన్నందున రైతు లు అప్ర మత్తంగా ఉండాలని పొలాస, రుద్రూర్ వ్యవసాయ పరిశోధన కేంద్రాల వాతావరణ శాస్త్రవేత్తలు తెలిపారు. జిల్లాలో నేడు అతి భారీ వర్షం పడే అవకాశం ఉందని వారు తెలపడంతో పాటు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ హెచ్చరికను జారీ చేసిందని తెలిపారు. జిల్లాలోని కొన్నిప్రాంతాల్లో భారీ వర్షాలు, మరికొన్ని ప్రాంతాల్లో అతిభారీ వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈనెల 2న జిల్లాలో ఓ మోస్తారు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. ఈనెల 3న జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో జల్లుల నుంచి ఓ మోస్తారు వర్షం, మరికొన్ని ప్రాంతాల్లో భారీ వర్షం పడే అవకాశం ఉందన్నారు. 4న జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో వర్షం పడే అవకాశం ఉందని తెలిపారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

జిల్లాలో ఓ మోస్తారు నుంచి భారీ, అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉండటంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు శ్రీలక్ష్మి, డాక్టర్ శ్రీనివాస్‌లు కోరారు. వరి వేసిన రైతులు పిలక దశలో ఉంటే పొలం ముంపుకు గురికాకుండా చూసుకోవాలని కోరారు. భారీ వర్షాలు పడితే పంటలో భారీగా నీళ్ల చేరే అవకాశం ఉందన్నారు. జింక్ లోపం ఎక్కువగా ఉండే అవకాశం ఉండటంతో రైతులు జింక్ సల్ఫేట్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని కోరారు. బ్యాక్టీరియా, ఎండు తెగుళ్ల లక్షణాలు గమనించినట్లయితే నివారణ కోసం ప్లాంటోమైసిన్ 0.2 గ్రాములు తీసుకొని లీటరు నీటిలో కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలన్నారు. మొక్కజొన్న నీటిలో మునగకుండా చూసుకోవాలన్నారు. అధిక తేమను ఈ పంట తట్టుకోదన్నారు. పంటచేనులో నీటి నిల్వలు ఉంటే తీసివేయాలన్నారు. కాండం కుళ్లు తెగుళ్లు వస్తే 35 శాతం క్లోరిన్‌తో కూడిన బ్లీచింగ్ పౌడర్‌ను ఎకరానికి 5కిలోలు తీసుకొని చల్లాలని శాస్త్రవేత్తలు వివరించారు. సోయాపంటకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. నీట మునిగితే పంట దెబ్బతింటుందని తెగుళ్లు వస్తాయని తెలిపారు. పంట పొలాల్లో నీటిని తీసివేయడంతో పాటు ఆకుమచ్చ తెగుళ్లు ఉన్నట్లయితే ఒక గ్రాము స్ట్రెప్టోసైక్లిన్ 10 లీటర్లకు నీటిని కలిపి పిచికారీ చేయాలన్నారు. కందికి ఫైటోపొరా తెగుళ్లు సోకితే 3గ్రాముల మాంకోజెట్ లీటరు నీటితో కలిపి పిచికారి చేయాలని కోరారు. పసుపు నీట మునిగితే ఇబ్బందులు వస్తాయని ఇనుప దాతువులోపం ఏర్పడుతుందని తెలిపారు. రైతులు నీరు నిలువకుండా చూసుకోవాలని కోరారు. ఒకవేళ లోలం ఉన్నట్లయితే 10 గ్రాముల మైక్రోన్యూట్రియంట్‌ను తీసుకొని లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు.



దీపాదాస్ మున్షికి పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

దీపాదాస్ మున్షిని కలిసిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నిజామాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షిని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి శనివారం కలిశారు. ప్రభుత్వ సలహాదారుగా నియమించినందుకు గానూ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో తాను బాధ్యతలు చేపడుతానని, ఆ కార్యక్రమానికి హాజరుకావాలని ఆయన దీపాదాస్ మున్షిని కోరారు. ఆయనవెంట డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, హైదరాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహన్‌రెడ్డి, గాల్‌రెడ్డి, రాజీవ్‌రెడ్డి ఉన్నారు.

విద్యారంగంలో జిల్లా వెనుకబాటు: విద్యార్థి సంఘాలు

నిజామాబాద్అర్బన్, ఆగస్టు31: విద్యారంగంలో జిల్లా వెనుకబాటుకు గురైందని విద్యార్థి సంఘాల నాయకులు అన్నారు. శనివారం నగరంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో టీజీవీపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి కళ్యాణ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విద్యార్థి సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశానికి ఏఐఎస్ ఎఫ్, టీవీయూవీ, టీజీవీపీ, ఏబీపీఎస్‌యూ సంఘాల నాయకులు బానుచందర్, లాల్‌సింగ్, బోడ అనీల్, రఘురాం, తదితరులు హాజరై మాట్లాడారు. కొన్ని సంవత్సరాలుగా నిజామాబాద్ జిల్లా విద్యారంగంపై రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టిపెట్టడం లేదని విద్యావ్యవస్థలో అనేక సమస్యలు ఉన్నప్పటికి వాటిని పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వాలు మారిన జిల్లాకు కొత్తగా విద్యాసంస్థలు కేటాయించకపోవడం జిల్లాను నిర్లక్ష్యం చేయడమేనన్నారు. జిల్లాలో బీ టెక్ కళాశాల ఏర్పాటుచేస్తామని పనులు కూడా మొదలుపెట్టి నిధుల కేటాయింపులో జాప్యం చేయడం సరికాదన్నారు. గత ప్రభుత్వం కేవలం కుటుంబ పాలనకే పరిమితమైందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాకు వెటర్నరీ కళాశాల కేటాయించాలని, పార్మ కళాశాల కూడా కేటాయించాలని అన్నారు. ఎన్నికల సందర్భంగా జిల్లాకు పలుమార్లు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాకు కళాశాలలు కేటాయిస్తామని చెప్పారని అదేవిధంగా కేటాయించాలన్నారు. జిల్లాకేంద్రంలో ఉమెన్స్ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు నగేష్, తదితరులు పాల్గొన్నారు.



రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న విద్యార్థి సంఘాల నాయకులు



మాట్లాడుతున్న బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు పిల్లి శ్రీకాంత్

యూనివర్సిటీకి వీసీని నియమించాలి

● బీజేవైఎం నాయకులు డిమాండ్

డిచ్‌పల్లి, ఆగస్టు31: తెలంగాణ యూనివర్సిటీ రెగ్యూలర్ వైస్‌చాన్స్‌లర్‌ను నియమించాలని బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు పిల్లి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన తెలంగాణ వర్సిటీలో స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ వీసీ లేక వర్సిటీ పాలన కుంటుపడిందని, విద్యార్థులు అసౌకర్యాలకు గురి అవుతున్నారని కాలయాపన చేయకుండా రెగ్యూలర్ వీసీని ప్రభుత్వం నియమించాలని డిమాండ్‌చేశారు. రాష్ట్రబడ్జెట్‌లో వర్సిటీకు నిధులు కేటాయించకపోవడంతోనే కాంగ్రెస్ ప్రభుత్వానికి విద్యపై ఎంత మక్కువ ఉందో తెలిసిపోయిందని విమర్శించారు. సమావేశంలో తరుణ్, నవీన్, సాయిపవన్, అనురాగ్, విఘ్నేశ్, పాల్గొన్నారు.

టీయూలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

డిచ్‌పల్లి, ఆగస్టు31: పెండిగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయకపోవడం సిగ్గుచేటని అని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ అన్నారు. పీడీఎస్‌యూ టీయూ కమిటీ ఆధ్వర్యంలో శనివారం వర్సిటీలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. రాజేశ్వర్ మాట్లాడుతూ పేద బడుగుబలహీన వర్గాలకు చెందిన విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడం దారుణమన్నారు. పేద విద్యార్థులను విద్యకు దూరం చేయాలనే కుట్ర జరుగుతోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న రీయింబర్స్‌మెంట్‌ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీయూ పీడీఎస్‌యూ నాయకులు ప్రిన్స్, రవీందర్, గోపి, రాకేశ్, బాలాజీ, భరత్,మణికంఠ, నితిన్, దర్శు పాల్గొన్నారు.

'పాత పెన్షన్ అమలు చేయాలి'

ముప్కాల్, ఆగస్టు31: ఎలక్షన్ మెనిఫెస్టోలో వాగ్దానం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం కచ్చితంగా కంట్రిబ్యూటర్ పెన్షన్ స్థానంలో పాత పెన్షన్ అమలు చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.హనుమంతరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ముప్కాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవీ విరమణ పొందుతున్న భగవాన్‌దాస్ సన్మాన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ప్రాథమికపాఠశాలలో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్‌ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుహక్కు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో రాజేశ్వర్, పాఠశాల హెచ్ఎం గంగారాం, తెలంగాణప్రాంత ఉపాధ్యాయసంఘం జిల్లాఅధ్యక్షురాలు కృష్ణవేణి ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పడకల్ విద్యార్థుల ఎంపిక

జక్రాన్‌పల్లి, ఆగస్టు31: రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు జక్రాన్‌పల్లి మండలం పడకల్ ఉన్నతపాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు వ్యాయమ ఉపాధ్యాయుడు గడ్డంశ్రీనివాస్ తెలిపారు. ఆర్మూర్‌లో ఆగస్టు 28న జరిగిన సబ్ జూనియర్ జిల్లా టెన్నికాయిట్ పోటీల్లో ఉత్తమప్రతిభ కనబర్చిన 8వ తరగతి చదువుతున్న చందన, నరేష్ రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఆర్మూర్‌లో సెప్టెంబర్ 1, 2, 3తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలో విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు.

'చలో విద్యుత్ సౌదా మహాధర్నాను విజయవంతం చేయండి'

సుభాష్‌నగర్, ఆగస్టు 31: విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం చలో విద్యుత్‌సౌదా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఉద్యోగజేఏసీ చైర్మన్ సురేష్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని నాగారంలో గల అసోసియేట్ బిల్డింగ్‌లో తెలంగాణ విద్యుత్ ఓసీ, బీసీ ఉద్యోగుల ఐక్య కార్యచరణ సమితి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చలో విద్యుత్ సౌదా కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఈ వెంకటరమణ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా చైర్మన్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో అన్ని క్యాడర్‌లలో నేరుగా నియమించబడ్డ ఉద్యోగుల సీనియారిటీలను మెరిట్ ఆధారంగా పదోన్నతులు కల్పించాలన్నారు. నష్టపోయిన ఓసీ, బీసీల ఉద్యోగులకు పదోన్నతులు కల్పించి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కోచైర్మన్ శ్రీనివాస్‌రావు, కన్వీనర్ రమణ, కోకన్వీనర్ శ్యామ్, డిఈలు ఆరోగ్యరాజ్, సత్యప్రకాశ్, ఏడీఈలు తోటరాజశేఖర్, రాజేందర్, శ్రీనివాస్, ఆనంద్‌రాజ్, బిసి నాయకులు హరికృష్ణ, కాశీనాథ్, సునీత పాల్గొన్నారు.

పెన్షన్ విద్రోహ దినాన్ని విజయవంతం చేయాలి



నగరంలో ఐక్యతను చూపిస్తున్న ఉద్యోగులు

సుభాష్‌నగర్, ఆగస్టు 31:ప్రతియేటా సెప్టెంబరు 1న నిర్వహించే పెన్షన్ విద్రోహ దినాన్ని విజయవంతం చేయాలని టీఎన్‌జీవోస్ అధ్యక్షుడు ఉద్యోగ జేఏసీ చైర్మన్ అలుక కిషన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవోస్ కార్యాలయంలో వివిధ ఉద్యోగ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్ రద్దు డిమాండ్‌తో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. సీపీఎస్ ఉద్యోగితో పాటు ఓపీఎస్ ఉద్యోగులందరు అధిక సంఖ్యలో హాజరై నిరసన వ్యక్తం చేయాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఉద్యోగుల గళం గట్టిగా చేరవేసి హక్కుల సాధన కోసం పోరాడాలని అన్నారు. ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు సంగం అమృత్‌కుమార్, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, టిఎన్‌జివోస్ కార్యదర్శి నేతికుంట శేఖర్, పిఆర్‌టియు అధ్యక్ష, కార్యదర్శులు మోహన్ రెడ్డి, వెంకన్న, టిఎస్‌యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి రమేష్, టిపిటిఎఫ్ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలి

పెద్దబజార్, ఆగస్టు 31: రోజురోజుకు పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించాలని అర్హులందరికి రేషన్ కార్డులు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ అన్నారు. శనివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిత్యవసర సరుకుల ధరలు తగ్గించకపోవడంతో ప్రజలపై మరింత భారం పెరుగుతుందని అన్నారు. 2021లో నిర్వహించాల్సిన జనాభా లెక్కలు నిర్వహించకపోవడంతో కొత్త రేషన్‌కార్డుల జారీ రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేసిందని, ఆశ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న వారికి రేషన్ కార్డులు మంజూరు చేయాలని అన్నారు. సుప్రీంకోర్టు ఆదేశించిన రేషన్ కార్డులు మంజూరు చేయలేదని, మరోవైపు రేషన్ కార్డు లు ఉన్న వారందరూ సెప్టెంబరు 30లోపు తమ ఆధార్ ఈకెవైసీని అనుసంధానం చేసుకోకపోతే రేషన్ కార్డులు రద్దు అవుతాయని ప్రభుత్వం ప్రకటించిందని దీనివల్ల అనేక మంది ఇతర ప్రాంతాలకు వలస పోయిన కూలీలు కార్మికులు రేషన్ కార్డులు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం ఈకెవైసీ నిబంధనలు రద్దు చేయడంతో పాటు జనాభా లెక్కలు పూర్తి చేసి అర్హులైన పేదలందరికి రేషన్ కార్డు లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సెప్టెంబరు 2న ధర్నా చౌక్ వద్ద ఉదయం 11గంటలకు నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు విఠల్‌గౌడ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

'వైద్య సిబ్బందిని నియమించండి'

పెద్దబజార్, ఆగస్టు 31: రాష్ట్ర వ్యాప్తంగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రాష్ట్రంలో వైరల్ ఇన్ఫెక్షన్, డెంగ్యూ జ్వరాల వల్ల ఇటీవల కాలంలో అనేక ప్రజలు మృత్యువాత పడుతున్నారని బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ దండి వెంకట్ ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం నగరంలోని సుభాష్‌నగర్‌లోగల బిఎల్‌ఎఫ్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల్లో డాక్టర్, సిబ్బంది నియామకాలను చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి జిల్లా, మండల, గ్రామ పంచాయతీ పరిధిల్లో హెల్త్, రెవెన్యూ ఇతర ప్రభుత్వ శాఖలతో పాటు ప్రైవేటు డాక్టర్స్, స్వచ్ఛంద సంస్థల సహకారంతో విస్తృతమైన హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసి ప్రజలకు యుద్ధప్రాతిపదికన చికిత్సలు అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌ఎఫ్ జిల్లా అధ్యక్షురాలు సబ్బనిలత, నగర కార్యదర్శి పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రమశిక్షణ, సంస్కారం అలవర్చుకోవాలి : ఏసీపీ

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు31: విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ, సంస్కారం అలవార్చుకోవాలని ఆర్మూర్ ఏసీపీ బస్వారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని చేపూర్ క్షత్రీయ పాఠశాల క్రీడా మైదానంలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఆర్మూర్ మండల స్థాయి రూరల్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు ఓటమికి నిరుత్సహ పడకుండా గెలుపుకోసం ప్రయత్నించాలన్నారు. విద్యార్థులు చదువులో లక్ష్యాలను ఏర్పర్చుకొని వాటి సాధనకు పట్టుదలతో కృషి చేసినప్పుడు విజయం మీ సొంతమవతుందన్నారు. తహసీల్దార్ గజానంద్ మాట్లాడుతూ ఆటలలో గెలుపు, ఓటమిలు సహజమని, నేటి ఓటమి రేపటి గెలుపునకు నంది అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి రాజగంగారాం, క్షత్రీయ కళాశాల కార్యదర్శి అల్జాపూర్ దేవేందర్, కోశాధికారి అల్జాపూర్ గంగాధర్, క్రీడల కన్వీనర్ చేతనకుమారి, కోకన్వీనర్ లక్ష్మీనర్సింహస్వామి, గంగాధర్, బ్రిజేష్, వివిధ పాఠశాలల పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ బస్వారెడ్డి

● పోటీలో విజేతలు వీరే..

మండల స్థాయి అంతర్ పాఠశాలల క్రీడల్లో జూనియర్ కబడ్డి విభాగంలో ఇస్సాపల్లి ప్రథమ, మగ్గిడి ద్వితీయ, బాలుర ఖోఖోలో ఫత్తేపూర్ ప్రథమ, టీజీడబ్ల్యుఆర్ఎస్ పిప్రి ద్వితీయ, బాలికల కబడ్డి విభాగంలో మగ్గిడ్డి పాఠశాల ప్రథమ, పిప్రి ద్వితీయ, వాలీబాల్ విభాగంలో మగ్గిడి ప్రథమ, చేపూర్ ద్వితీయ బహుమతులు సాధించారు. సబ్‌జూనియర్ కబడ్డీలో బాలుర కబడ్డీలో క్షత్రీయ ప్రథమ, మంథన ద్వితీయ, ఖోఖోలో గురుకుల పిప్రి ప్రథమ, జడ్పీహెచ్ఎస్ పిప్రి ద్వితీయ బహుమతులు సాధించారు.

ఎమ్మెల్యే సహకారంతో పట్టణ అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్

బోధన్‌రూరల్,ఆగస్టు31: బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సహకారంతో పట్టణంలోని అన్ని వార్డులను అభివృద్ధి చేస్తున్నామని బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మశరత్ రెడ్డి అన్నారు. శనివారం బోధన్ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 37ఎజెండా అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపిందన్నారు. డ్రింకింగ్ తాగునీటి సమస్య పరిష్కారం కోసం 46లక్షలు, 15వ ఆర్థిక సంఘం నిధుల నుండి 1.50లక్షలు కేటాయించడం జరిగిందన్నారు. పార్టీలకు అతీతంగా పట్టణంలోని అన్ని వార్డులను అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. పట్టణ అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని ఆమె పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా అన్ని వార్డులను అభివృద్ధి చేయడానికి ప్రణాళిక రూపొందించామన్నారు. బోధన్ మున్సిపాలిటీని తెలంగాణలోనే ఎమ్మెల్యే సహకారంతో ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణలతో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

'భజన మండలి సాధన శిబిరాన్ని విజయవంతం చేయండి'

నిజామాబాద్ కల్చరల్, ఆగస్టు 31: సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా పరిధిలో ఆదివారం నిర్వహించనున్న భజన మండలి సమన్వయ కర్తల సాధనా శిబిరాన్ని విజయవంతం చేయాలని సత్యసాయి సమితి అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. శిబిరం జిల్లా కేంద్రంలోని సత్యసాయి మందిరంలో ఉంటుందని అన్నారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు వివిధ అంశాలపై చర్చ జరుగుతోందని జిల్లా నలుమూలల నుంచి సాధనా శిబిరానికి భజన మండలి నిర్వాహకులతో పాటు సత్యసాయి కమిటీ రాష్ట్ర నాయకులు పాల్గొంటారని అన్నారు.

పాలెం ప్రభుత్వ పాఠశాల తనిఖీ



పాలెంలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న మండల నోడల్ అధికారి

మోర్తాడ్, ఆగస్టు31: మండలంలోని పాలెం గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మండల నోడల్ అధికారి సమ్మిరెడ్డి తనిఖీ చేశారు. ప్రతీ తరగతి గదుల్లోకి వెళ్లి పిల్లల సామర్థ్యాలను, వారికి రాసిన పరీక్షల గురించి, బెస్‌లైన్ టెస్ట్, ఎల్ఐపీ, ఎఫ్ఏ-1 పరీక్షల గురించి విద్యార్థులను అడిగితెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం జరిపి ప్రతీ ఉపాధ్యాయులు ప్రతీరోజు లెసన్‌ప్లాన్ రాయాలని, యూనిట్ ప్లాన్ రాయాలని, ఇయర్ ప్లాన్‌లను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్‌రావు, మహేష్‌కుమార్‌గౌడ్, చంద్రశేఖర్, నర్సింహస్వామి, రాజేందర్, బెస్సీ, త్రివేణి, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన

ఎడపల్లి, ఆగస్టు31: ఎడపల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండలంలోని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో మండల పంచాయతీ అధికారి మన్‌మోహన్ శర్మ సమావేశమై సీజనల్ వ్యాధుల నివారణ పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో డెంగీ వ్యాధి విజృంభిస్తున్న తరుణంలో గ్రామాలలో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని, గ్రామాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. డెంగీవ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే మెడికల్ అధికారులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు ఆయా జీపీల కార్యదర్శులు తదితరులు ఉన్నారు.



పంచాయతీ కార్యదర్శులతో సమావేశం

నవీపేటలో మినీ ట్రక్ చోరీ



నవీపేట మేకల సంతలో చోరీకి గురైన మినీ ట్రక్ వాహనం

నవీపేట,ఆగస్టు31: నవీపేటలో శనివారం జరిగిన మేకల సంతకు వచ్చిన అశోక్ లేలాండ్‌కు చెందిన మినీట్రక్ వాహనం చోరీకి గురైంది. బోధన్‌కు చెందిన మేకల వ్యాపారులు హర్షద్, ముజాయిత్ అనే అన్నదమ్ములు తెలిపిన ప్రకారం గల అశోక్ లేలాండ్ మినీట్రక్ వాహనం నవీపేటలోని రాంపూర్ వెళ్లే రహదారి పక్కన నిలిపి ఉంచగా గుర్తు తెలియని దొంగ అపహరించాడని వారు పేర్కొన్నారు. వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపి ఉంచి తాము సంతలోకి వెళ్లి తిరిగి వచ్చే సరికి వాహనం మాయమైందని పక్కనే దుకాణంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా గుర్తు తెలియని దొంగ మారు తాళం చెవితో వాహనాన్ని ఎత్తుకెళ్లినట్లు సీసీ కెమెరాలో నమోదైందని వారు పేర్కొన్నారు. ఈ విషయంలో నవీపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందని బాధితులు పేర్కొన్నారు. ఈ విషయంపై ఎస్ఐ వినయ్‌ని వివరణ కోరగా వాహనం చోరీ అయిన మాట నిజమేనని అన్నారు. ఇదిలా ఉండగా చోరీకి గురైన వాహనం మహారాష్ట్రలోని ముద్‌ఖేడ్‌లోని పెట్రోల్ బంక్‌లో సంబంధిత వాహనంలో డీజిల్‌లో పోస్తున్నట్లు అక్కడి సీసీ కెమెరాలో కూడా నమోదైందని బాధితులు వివరించారు.

పలు వార్డుల్లో బీజేపీ సభ్యత్వంపై అవగాహన

ఆర్మూర్‌టౌన్,ఆగస్టు31:పట్టణంలోని పలువార్డుల్లో బీజేపీ సభ్య త్వంపై జిల్లాసభ్యత్వ కన్వీనర్ పుప్పాలశివరాజ్‌కుమార్ శనివారం శక్తికేంద్ర ఇన్‌చార్జీలకు, నాయకులకు అవగాహన కల్పించారు.ఈసందర్భంగా 47, 48,49,50బూత్‌లలో సమావేశం నిర్వహించి పార్టీసభ్యత్వంపై అవగాహన కల్పించి ఆన్‌లైన్ ద్వారా ఫోన్‌నెంబర్ 8800002024నెంబర్‌కు మిస్‌కాల్ ద్వారా సభ్యత్వం పొందవచ్చునని వివరించారు.ఈ కార్యక్రమంలో శక్తికేంద్రాల ఇన్‌చార్జి పొల్కంవేణు,బీజేపీనాయకులు కృష్ణగౌడ్, శశాంత్, శివరాంరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

ఖిల్లా, ఆగస్టు 31: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన నగరంలోని ఐదో టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని నాగారంలో శనివారం జరిగింది. నాగారంకు చెందిన ఖాలేఖ్‌బిన్ అబ్దుల్లా (48) ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్ గురయ్యాడు. మృతుడు నాగారంలో ఓఇంటిలో ఫ్యాన్‌రిపేర్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి కిందపడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ. గంగాధర్ తెలిపారు. మృతుడికి ముగ్గురు సంతానం ఉన్నారు.

కోనో కార్పస్ చెట్లను తొలగించాలని వినతి

ఎడపల్లి, ఆగస్టు31: ఎడపల్లి మండలంలోని జానకంపేట గ్రామంలోని రాజీవ్ నగర్ కాలనీ వాసులు తమ కాలనీలో ఉన్న ప్రాణాంతకమైన కోనో కార్పస్ చెట్లను తొలగించాలని శనివారం గ్రామ పంచాయితీ కార్యదర్శి ప్రేమ్‌దాస్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెట్టుపై పక్షి కూడా వాలని కోనో కార్పస్ చెట్లను కాలనీలో నాటారని వాస్తవానికి ప్రతీ చెట్టు కార్బన్ డై ఆక్సైడ్‌ను తీసుకుని ఆక్సిజన్‌ను వదులుతాయని, కానీ కోనో కార్పస్ చెట్టు మాత్రం ఆక్సిన్‌ను తీసుకుని కార్బన్ డై ఆక్సైడ్‌ను వదులుతాయని శాస్త్రవేత్తల పరిశోధనలో తేలిందని, అలాంటి ప్రాణాంతకమైన చెటను తొలగించాలని వారు కోరారు. వినతి పత్రం అందించిన వారిలో రాజీవ్ నగర్ కాలనీ వాసులు తదితరులు ఉన్నారు.

అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవు

బోధన్‌రూరల్,ఆగస్టు31: బోధన్ మండలంలోని మంజీర సరిహద్దు గ్రామాల నుండి అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి అన్నారు. శనివారం ఉదయం అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను రవాణా చేస్తున్న రెండు టిప్పర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. ప్రభుత్వం నియమ, నిబంధనలను తప్పకుండా ప్రతి ఒక్కరు పాటించాలన్నారు. ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమ ఇసుక రవాణా చేస్తే వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందన్నారు.

సీజీఆర్‌ఎఫ్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన నారాయణ

సుభాష్‌నగర్, ఆగస్టు 31: టీజీఎన్‌పీడీసీఎల్ సీజీఆర్‌ఎఫ్ చైర్మన్‌గా ఎరుకల నారాయణ పదవీబాధ్యతలు స్వీకరించారు. నగరంలోని పవర్ హౌజ్ కంపౌండ్ కార్యాలయంలో నూతనంగా నియమించబడ్డ నారాయణ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి నిజామాబాద్ జిల్లాతో పాటు ఆదిలాబాద్, సిరిసిల్లా, జగిత్యాల జిల్లాల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరించే విధంగా సీజీఆర్‌ఎఫ్ పనిచేస్తుందని అన్నారు. నూతన సీజీఆర్‌ఎఫ్ చైర్మన్‌ను ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం సభ్యులు, విద్యుత్ శాఖ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. సీజీఆర్‌ఎఫ్ చైర్మన్‌ను కలిసిన వారిలో చీఫ్ ఇంజనీర్ రామకృష్ణ, ఎస్సీ, ఎస్టీ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ నాంపల్లి, డీఈలు, ఏడీఈలు ఉత్తమ్, అశోక్, నాగరాజు, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజలు అప్రమత్తంగా ఉండాలి'

కోటగిరి,ఆగస్టు 31: రెండు రోజుల పాటు భారీ నుంచి, అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పొతంగల్ తహసీల్దార్ మల్లయ్య సూచించారు. పొతంగల్ తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పాత ఇళ్లలో ఉండరాదని సూచించారు. మంజీర పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రెండు రోజుల పాటు ఎలాంటి ప్రయాణాలు పెట్టుకోకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సాయిలు పాల్గొన్నారు.

ఓటరు జాబితాను పకడ్బందీగా తయారు చేయాలి

● అడిషనల్ కలెక్టర్

దోమకొండ, ఆగస్టు 31:గ్రామ పంచాయతీల ఓటర్ లిస్టును పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌ఓలు పకడ్బందీగా తయారు చేయాలని అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం దోమకొండ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో జరుగుతున్న ఓటర్ జాబితా ప్రక్రియను ఆయన పరిశీలించారు.అదే విధంగా మండలంలో జరుగుతున్న ఎల్ఆర్ఎస్ సర్వేను పరిశీలించారు. పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు వహించాలని కార్యదర్శులకు ఆదేశించారు.అడిషనల్ కలెక్టర్‌ను మాజీ జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్ శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు రమేష్, అంజయ్య, శ్రీనివాస్,స్నేహ, పద్మ, వసంత, శ్రీనివాస్, సౌందర్య, శ్రీకాంత్, కిషన్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

బీటీఎస్ వద్ద అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలని వినతి

దోమకొండ, ఆగస్టు 31:దోమకొండ, దుబ్బాక, సిద్దిపేటకు వెళ్లేందుకు జాతీయ రహదారి అయిన బీటీఎస్ వద్ద అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలని కోరుతూ శనివారం ఎంపీ సురేష్ షెట్కర్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీకి దోమకొండ మాజీ జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్ కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ గెస్టుహౌస్‌లో వినతిపత్రం అందజేశారు. దోమకొండ వైపు నుంచి రాకపోకలు సాగించే భారీ వాహనాలు, ఆర్టీసి బస్సులు అంతంపల్లి టోల్‌గేట్ వద్ద యూటర్న్ తీసుకుని రావాల్సివస్తుందని అందువలన దూరభారంతో పాటు డీజీల్ వృధ అవుతుందన్నారు. బ్రిడ్జి నిర్మాణం చెపడితే ప్రజలకు రవణా సౌకార్యం సులువుగా ఉంటుందని వినతిపత్రంలో పెర్కొన్నారు. బ్రిడ్జి నిర్మాణం చెపట్టేలా కృషి చేయాలన్నారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అనంతరెడ్డి, మాజీ సీడీసీ చైర్మన్ ఐరేని నర్సయ్య, పట్టణద్యక్షులు సీతారాం మధు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆసుపత్రుల తనిఖీ

పెద్దకొడప్‌గల్, ఆగస్టు 31: జుక్కల్ మండల కేంద్రంలో గల ప్రయివేట్ ఆసుపత్రులలో వైద్యం చేసే పీఎంపీ, ఆర్ఎంపీ వైద్యులు తమ స్థాయికి మించిన వైద్యం చేస్తే చర్యలు తీసుకుంటామని మండల వైద్యాధికారి విఠల్ హెచ్చరించారు, శనివారం జిలా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలో గల పీఎంపీ, ఆర్ఎంపీలు చికిత్స చేసే ఆసుపత్రులను తనిఖీ చేశారు, ఈ సందర్భంగా వైద్యాధికారి విఠల్ మాట్లాడుతు ప్రస్తుతం ఆయా గ్రామాలలో వైరల్ ఫీవర్ వస్తున్నందున తమ రోగులకు భయపెట్టి అవసరం ఉన్న లేకున్న లేనిపోని పరీక్షలు చేయించుకోవాలంటూ ఆర్థికంగా నష్టపరుస్తున్నారని తమకు ఫిర్యాదులు అందాయని తెలిపారు. అంతేగాక వీరు ఆసుపత్రులలో బెడ్లు ఏర్పాటుకు అనుమతి లేకున్న ఆసపత్రులలో బెడ్లు ఏర్పాటు చేసుకుని మోతాదుకు మించిన మందులు ఇవ్వడం, స్టెరాయిడ్స్, ఐవి ఫ్లూయిడ్స్ పెట్టడం లాంటివి నిబంధనలకు విరుద్ధంగా చేస్తున్నారని తెలిపారు. ప్రథమ చికిత్స కాకుండా కార్పోరేట్ స్థాయిలో వైద్యం చేసిన ఆసుపత్రులకు త్వరలో షోకాజ్ నోటీసులు అందచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు విక్రం, శశి, మోగేష్ తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డిరూరల్: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని డ్రైవర్స్‌కాలనీలో ఉన్న ప్రైవేట్ పీఎం పీ, ఆర్ఎంపీ ఆసుపత్రులను దేవునిపల్లి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డా.జోహా ముజీబ్ తనిఖీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జ్వరం ఉన్న లేకున్నా నార్మల్ చెకప్ కోసం వచ్చే వారికి ప్రాథమిక చికిత్స మాత్రమే అందించాలి, వారికి సైలన్ ఎక్కించడం, ట్రీట్‌మెంట్‌ల వంటివి చేయవద్దని అవసరమైతే వారిని దగ్గరలో ఉన్న ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రానికి పంపించాలన్నారు.

నాగిరెడ్డిపేట : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని ఆర్ఎంపీ, పీఎంపీల క్లినిక్‌లను శనివారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు స్రుజన్ కుమార్ తనిఖీలు నిర్వహించారు. ఆర్ఎంపీ, పీఎంపీలు తమ క్లినిక్‌లకు వచ్చే రోగులకు కేవలం ప్రాథమిక చికిత్సలు మాత్రమే చేయాలని ఆయన తెలిపారు. ఇంజక్షన్లు గాని హైడ్రోస్ మందులు గాని రోగులకు ఇవ్వద్దని, గ్లూకోస్‌లు రోగులకు ఎక్కించోద్దని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపించాలన్నారు. క్లినిక్‌లలో గ్లూకోస్‌లు గాని, హైడోస్ ఇంజక్షన్ గాని, యాంటి బేటిక్ మందులు ఇస్తున్నట్లు తెలిసే అలాంటి క్లినిక్‌లపై వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

భీమ్‌గల్‌లో కోర్టు ఏర్పాటు చేయాలని వినతి

భీమ్‌గల్, ఆగస్టు31: భీమ్‌గల్ మండల కేంద్రానికి మంజూరైన కోర్టును ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలని కోరుతూ సర్వసమాజ్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ మహమ్మద్‌షబ్బీర్‌కు వినతిపత్రం అందజేశారు. 2007 సంవత్సరంలో గజిట్ నోటిఫికేషన్‌తో భీమ్‌గల్‌కు మంజూరైన కోర్టు కొన్ని అనివార్య కారణాల వల్ల ఆర్మూర్‌లో ఏర్పాటు చేశారని, దీంతో ఇక్కడి ప్రాంత ప్రజలు ఆర్మూర్ కోర్టుకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు సమ యానికి చేరుకోలేక పోతున్నారని కనుక అన్ని అర్హతలు కలిగి ఉన్న భీమ్‌గల్ మున్సిపాలిటీలో కోర్టు మంజూరు చేయాలని తహసీల్దార్‌ను కోరారు. వినతి పత్రం అందించిన వారిలో అధ్యక్షుడు చెవ్వ అశోక్, ఉపాధ్యక్షుడు గంగాదాస్, సభ్యులు లింబాద్రి, నర్సయ్య, సత్యనారాయణ, నవీన్, గంగాధర్, రంజిత్, వకిల్, చైతన్య, తదితరులు ఉన్నారు.

మోతె పాఠశాలకు బీరువా, కుర్చీలు వితరణ

వేల్పూర్, ఆగస్టు31: మండలంలోని మోతె గ్రామ ఉన్నత పాఠశాలకు అక్లూర్ గ్రామానికి చెందిన పూర్వవిద్యార్థి, గ్రామాభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షుడు జిన్న ప్రభాకర్ శనివారం డబుల్ డోర్ బీరువ, పది ఎస్.టాప్ కుర్చీలను వితరణ చేశారు. ఈ సందర్భంగా జీన్న ప్రభాకర్ పాఠశాల తరఫున ప్రధానోపాధ్యా యు డు వైద్య గణేష్, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. పాఠశాలకు పూర్వవిద్యార్థుల సహకారం ఎల్లవేళల ఉండాలని హెచ్ఎం గణేష్ కోరారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయు మండల ప్రధానకార్యదర్శి సీవీ.నర్సింహరావు, ఉపాధ్యాయులు కృష్ణవేణి, గణేష్, మహేందర్, రత్నయ్య, కవిత, శ్రావణ, లలిత, తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల సాధికారత కోసం ప్రత్యేక పథకాన్ని ప్రకటించాలి

● ఎంపీఆర్‌డీ రాష్ట్ర కార్యదర్శి అడివయ్య

బోధన్‌రూరల్,ఆగస్టు31: వికలాంగుల సంక్షేమం, సమగ్ర అభివృద్ధి కోసం ప్రత్యేక పథకాన్ని అమలు చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర కార్యదర్శి ఎం.అడివయ్య అన్నారు. శనివారం బోధన్ పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా 3వ మహసభను నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీఆర్‌డీ రాష్ట్ర కార్యదర్శి అడివయ్య మాట్లాడుతూ దేశంలో సరైన తిండి లేక అనేక మంది అల్లాడుతుంటే కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మోడీ పాలనలో నిరుద్యోగం పెరిగిందని, నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయని, దీంతో పేద, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. జీఎస్టీ తీసుకువచ్చి ప్రజలపై భారం వేసి సంపన్నులకు లక్ష కోట్ల రాయితీ ఇచ్చే హక్కు మోడీకి ఎక్కడిదని ప్రశ్నించారు. ప్రధానమంత్రి అవాస్ యోజన కింద రాష్ట్రంలో ఒక్క ఇల్లు కూడా కట్టలేదని విమర్శించారు. 10లక్షల ప్రాథమిక ఉప వైద్య కేంద్రాలు ఉండాల్సిన చోట కేవలం లక్ష 46కేంద్రాలతో అందరికి వైద్యం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఇంకా రెండు కోట్ల ఉద్యోగాలు అంటూ నిరుద్యోగులకు కేంద్రం మోసం చేస్తుందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలో వికలాంగులపై దాడులు మహిళలపై లైంగిక వేధింపులు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయన్నారు. వికలాంగులు దుర్భరమైన స్థితిలో ఉన్నారని, వికలాంగుల కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రమేష్ బాబు, ఎంపీఆర్‌డీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.బస్వరాజ్, జిల్లా గౌరవ అధ్యక్షులు ఏశాల గంగాధర్, నాయకులు గంగాధరప్ప, సిర్ప లింగం, గంగాధర్, కవిత, గైని రాములు, రాంపటేల్, నజీమ్, సాయమ్మ, నాగమణి, లక్ష్మణ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీఆర్‌డీ రాష్ట్ర కార్యదర్శి

లారీ ఢీకొని ఎంబీఏ విద్యార్థి మృతి

కమ్మర్‌పల్లి, ఆగస్టు 31: కమ్మర్‌పల్లి మండలకేంద్రం శివారులోని పాటిహనుమాన్ వద్ద శనివారం సాయంత్రం జరిగిన రోడ్డుప్రమాదంలో ఎంబిఏ పూర్తచేసిన విద్యార్థి సుంకెట రవి మృతిచెందాడు. కుటుంబసభ్యుల వివరాలు ఇలాఉన్నాయి. ఆస్ట్రేలియాలో ఎంబీఏ పూర్తి చేసి ఉద్యోగ అన్వేషణలో ఉన్నాడు. అయితే 40 రోజుల సెలవుపై 15 రోజుల క్రితం స్వగ్రామం కమ్మర్‌పల్లికి వచ్చిన రవి శనివారం పాటిహనుమాన్ ప్రాంతంలో తన స్నేహితులతో కలిసి పార్టీచేసుకున్నాడని తెలిసింది. సాయంత్రం ఇంటికి బైక్‌పై తిరుగు ప్రయాణమైన రవిని ఎదురుగా వస్తున్న లాడి ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయమై అపస్మారకస్థితిలో వైద్యచికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో ప్రథమ చికిత్స నందిస్తు ఆర్మూర్‌లోని ప్రైవేటు అసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతు మరణించాడు. మృతిని తండ్రి 12 ఏళ్లక్రితం అనారోగ్యంతో చనిపోగా తల్లి సంరక్షణలో ఉన్నాడు. మృతునికి ముగ్గురు అక్కలు ఉన్నారు. ఒక్కగానొక్క కోడుకు మరికొద్దిరోజుల్లో ఉద్యోగంలో చేరాల్సి ఉండగా మృత్యువు వెంటాడంతో కుటుంబసభ్యుల, సన్నిహితుల రోదనలు మిన్నంటాయి. కాగా శనివారం సాయంత్రం కుంటుంబసభ్యుల స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసున మోదు చేసుకుని శవాన్ని పోస్టుమార్టంకై పంపి దర్యాప్తు చేస్తున్నట్లు కమ్మర్‌పల్లి ఇన్‌చార్జ్ ఎస్సై విక్రం తెలిపారు.

మారుతీ మందిరంలో ప్రత్యేక పూజలు



బోధన్ మారుతీ మందిర్‌లో అన్నదానం చేస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,ఆగస్టు31: బోధన్ పట్టణంలోని మారుతీ మందిరంలో శ్రావణ మాసం చివరి శనివారం సందర్భంగా మారుతీ మందిరంతో పాటు చావిడి హనుమాన్ మందిరం, తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. శ్రావణ మాస చివరి శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు వేద పండితులు ప్రవీణ్ మహరాజ్, ఉదయ్ మహరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు, దేవాదాయ శాఖ సిబ్బంది రాములు,కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను నియమించాలని వినతి

బోధన్‌రూరల్,ఆగస్టు31: సాలూర మండలంలోని హున్స ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పూర్తిస్థాయి ఉపాధ్యాయులను నియమించాలని శనివారం గ్రామస్థులు బోధన్ మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చీల శంకర్ మాట్లాడుతూ హున్స గ్రామంలోని జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలలను విడిగా ఏర్పాటు చేయాలని, పూర్తిస్థాయి ఉపాధ్యాయులను నియమించాలని జిల్లా విద్యాశాఖ అధికారిని కోరడం జరిగిందన్నారు.త్వరలోనే ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై పంపుతామని తెలిపారని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు ఈరయప్ప మహరాజ్, షమీ శంకర్, షికారి నారాయణ, నాని, వల్లకొండ, శివకుమార్, మాజీ ఎంపీటీసీ ప్రకాష్, శివ, తదితరులు పాల్గొన్నారు.

ఆలూర్ సొసైటీలో రైతులకు రుణాల అందజేత

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు31: ఆలూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో శనివారం 37మంది రైతులకు రూ.39లక్షల 38వేల నూతన స్వల్ప కాలిక పంట రుణాలను చైర్మన్ తంబురి శ్రీనివాస్ అందజేశారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ రైతులు తీసుకున్న రుణాలను తిరిగి సకాలంలో చెల్లించి సంఘ అభివృద్ధికి తోడ్పాటునందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ చేపూర్ రాజేశ్వర్, డైరెక్టర్‌లు బార్ల సంతోష్‌రెడ్డి, కల్లెం సాయిరెడ్డి, గోవర్ధన్, కల్లెం బోజారెడ్డి, ప్రమోద్‌కుమార్, మల్లాబాయి, ఆరే రాజేశ్వర్, వెల్మ నర్సారెడ్డి, గంగాధర్, పచ్చుకల లసుంబాయి, సంఘ కార్యదర్శి తొర్తి మల్లేష్, సిబ్బంది ముత్యం,దేవరాజ్,గంగాధర్, రాజు, గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి

మోర్తాడ్, ఆగస్టు31: విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అదిరోహించాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పెద్దన్న అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్టూడెంట్స్ టెస్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులతో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, డ్రాగ్స్ సేవించరాదని, శారీరక, మానసిక ఆరోగ్యంతో అనుకున్న లక్ష్యాలను సాధించుటకు అలుపెరగని కృషి చేయాలని అన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

నందిపేట , ఆగస్టు 31: నందిపేట మండలంలోని కౌల్‌పూర్ గ్రామ శివారులో ఉన్న రైతుఫారంలో ఉన్న డంపింగ్‌యార్డులో పేకాట ఆడుతున్న స్థావరంపై శనివారం రాత్రి పోలీసులు దాడి చేశారు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ అధికారులు పేకాట స్థావరంపై దాడి చేశారు. సుమారు రూ.11వేల 120 నగదు, మూడు ఫోన్‌లు, నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



మెంట్రాజ్‌పల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

మోపాల్, ఆగస్టు 31: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు.శనివారం బోర్గాం(పి) మున్నూరుకాపు కల్యాణ మండపంలో మనోరమా ఆసుపత్రి ఆధ్వర్యంలో మెగా వైద్య ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే వ్యాధులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. వర్షాకాలంలో అనేక మంది సీజనల్ వ్యాధులతో ఆసుపత్రుల్లో చేరుతున్నారని అన్నారు. వ్యాధులు రాకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని కో రారు. మహిళలు క్యాన్సర్ వ్యాధి బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎతైనా ఉందన్నారు. ప్రజలు అనారోగ్యంగా ఉన్నప్పుడే వెంటనే డాక్టర్‌ను సంప్రదించి వారి సలహాలు సూచనలు తీసుకోవాలని కోరారు. వైద్య శిబిరంలో పాల్గొన్న ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈకార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది, గ్రామస్థులు, కాం గ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● రైతుల శ్రేయస్సే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

డిచ్‌పల్లి: రాష్ట్రంలో రైతులను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఆర్థిక పరిస్థితి బాగలేకున్న ఇచ్చిన మాట ప్రకారం నేరవేరుస్తుందని అర్హులైన రైతులకు వచ్చే నెల లోపు పూర్తిగా అమలు చేయడం జరుగుతుందని రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి అన్నారు. మండలంలోని నడిపల్లి, ధర్మారం, బర్ధిపూర్, గ్రామాల్లో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.60లక్షలతోఆరోగ్య ఉపకేంద్రాల నిర్మాణ పనులకు ఆయన భూమి పూజ చేశారు. మెంట్రాజ్ పల్లిలో రూ.5లక్షల రూపాయలతో నిర్మించే పద్మశాలీ సంఘం భవనం కు ఎమ్మెల్యే భూమి పూజచేశారు. అనంతరం భూపతిరెడ్డి మాట్లాడుతూ- బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో స్కామ్‌లుగా ప్రభుత్వ పథకాలుగా మారాయని కాంగ్రెస్ ప్రభుత్వంలో అలాంటి పరిస్థితలు ఉండవని అర్హులైన ప్రతీ ఒక్కరి కి సంక్షేమ పథకాలు అమలు పరుస్తుందన్నారు. నాణ్యమైన విద్యా, భోజనం అందించడమే తమ లక్ష్యమన్నారు. రైతులు పంటల సాగులో నూతన మేళకువలు పాటించేల వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు అమలు పర్చలన్నారు రైతులు పండించని వరి ధాన్యం మద్దతు ధరతో ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని గడిచిన 9నెలల కాలంలో ఆరు గ్యారంటీలు రుణామాఫీ పూర్తి చేయడం జరిగిందన్నారు. మాఫీ కాని రైతుల వివరాలు అధికారులు సేకరిస్తున్నారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అమృతపూర్ గంగాధర్, పొలసాని శ్రీనివాస్,కంచెట్టి గంగాధర్,వాసుబాబు, సాయిప్రసాద్, పిచ్చేశ్వరరావు, సోమ్‌నాత్, కాంత రావు, రామకృష్ణ, శాంసన్, వెంకటస్వామి, శ్రీనివాస్ గౌడ్, డీఈ ఇసాక్ అలీ, ఏఈ శ్రీధర్, నడిపల్లి ఈవో కిసన్‌రావు, ఎంపీవో శ్రీనివాస్ గౌడ్, ఎంపీడీవో రవీందర్, పాల్గొన్నారు.

కంట్రోల్‌రూం ఏర్పాటు

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు31: రాబోయే రెండు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు ఉన్నందున కంట్రోల్‌రూం ఏర్పాటు చేస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ రాజు తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్‌రూంలో అధికారులు అందుబాటులో ఉంటారని, ఏమైన ప్రజలకు ఇబ్బందులు ఉంటే సంప్రదించా లని ఆయన తెలిపారు.అబ్దుల్‌సలీం 9396282202,అల్లూరిమోహన్ 7093570034, ఎల్.దిలీప్ 9182794499, ఎం.నరేష్ 6301799590నెంబర్‌లను సంప్ర దించాలని తెలిపారు.

దాడి చేసిన కేసులో వ్యక్తి అరెస్టు

ఖిల్లా, ఆగస్టు 31 :నగరంలోని మూడో టౌన్ పోలీసు స్టేషన్ పరిధి గౌతంనగర్‌లో ఇద్దరి మధ్య జరిగిన ఘర్షణలో ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు. గౌతంనగర్‌కు చెందిన మధు, పవన్‌లు కర్రలతో పరస్పరంగా దాడి చేసుకున్నారు.కర్రలతో దాడి మధుకు కంటి వద్ద తీవ్ర గాయాలు అయ్యాయి, వెంటనే మధును మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. బాధితుడి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పవన్‌ను అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నట్లు మూడవ టౌన్ ఎస్ఐ మహేష్ తెలిపారు.

రైతులు అధైర్య పడొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



తాడ్‌బిలోలిలో కాలువ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

● ప్రతీ ఒక్కరికి రూ.రెండు లక్షల రుణమాఫీ చేసి తీరుతాం
● అధికారులతో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సమీక్ష

రెంజల్,ఆగస్టు31: రైతుల సంక్షేమం కోసం అనేక ప్రాజెక్టులు కట్టి రైతుల పాలిట వరంగా నిలిచిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని, కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుండి రైతుల పక్షాన నిలుస్తుందని, రైతుల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని మాజీమంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని దూపల్లి, దండిగుట్ట, రెంజల్, నీలా బోర్గాం, తాడ్‌బిలోలి గ్రామంలోని పలు పనులను ఆయన పరిశీలించారు. నీలా లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా రైతులకు నీటి సౌకర్యాన్ని కల్పించాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. రైతులు అధైర్య పడాల్సిన పని లేదని, ప్రతి ఎకరానికి సాగునీరు అందిస్తామని, రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. అనంతరం తాడ్‌బిలోలి గ్రామంలోని ఈద్గా పనులను పరిశీలించారు. ఈద్గాకు అవసరమైన నిధులను ఇస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలోని చెరువు నుండి వచ్చే పంట కాలువకు సీసీ పనులను త్వరలోనే ప్రారంభిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. తాడ్‌బిలోలి గ్రామంలో శ్మశాన వాటికకు వెళ్లే రోడ్డును త్వరలోనే నిర్మిస్తామని, ఇందిరమ్మ కాలనీ వాసులకు డ్రైనేజీని త్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో డ్రైనేజీ సమస్య లేకుండా చూడాలని పంచాయతీ రాజ్ ఏఈ వినయ్‌కుమార్‌కు సూచించారు. అవసరమయ్యే నిధులను సమకూరుస్తామని, ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. రైతులు అధైర్య పడవద్దని రెండు లక్షల లోపు రుణమాఫీకి ప్రతి ఒక్కరికి వర్తింపజేస్తామన్నారు. ప్రతిపక్ష పార్టీల నాయకుల మాటలు నమ్మవద్దన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రెండు లక్షల రుణమాఫీ చేసి తీరుతామన్నారు. కందకుర్తి గ్రామంలో జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత అధికంగా ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా పాఠశాలలో టీచర్ల కొరతను తీర్చి వారం వ్యవధిలోపల టీచర్ల భర్తీ చేయాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. ఉర్దూ మీడియంకు అవసరమైన ఉపాధ్యాయులను ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్‌బిన్ హందాన్‌కు ఉపాధ్యాయులను అందించాలని సూచించారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చదిద్దాల్సిన బాధ్యత ప్రతి అధికారిపై ఉందన్నారు. అధికారులు సమన్వయంతో పనులు చేపట్టాలన్నారు. ముఖ్యంగా సాగుయోగ్యానికి ఉపయోగపడే నీరును రైతులు వృథా చేయకుండా అవసరం మేరకే నీటిని వినియోగించుకోవాలని, పంటలకు నీరు అందించే దిశగా పంట కాలువను ఎప్పటికప్పుడు పూడికతీత పనులు చేయించాలని, అవసరమైన మేరకు ఉపాధి హామీ ద్వారా పూడికతీత పనులు చేయించాలన్నారు.ఆయన వెంట ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, జిల్లా నాయకులు అంతిరెడ్డి రాజిరెడ్డి, మండల అధ్యక్షులు మొబిన్ ఖాన్, ఎమ్మార్వో శ్రావణ్ కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు సాయిరెడ్డి, రాములు, సాయిబాబా గౌడ్, జావీదోద్దీన్, గయాస్, సురేందర్ గౌడ్, నితిన్, కార్తీక్, సిద్ద సాయిలు, గంగాధర్, నర్సయ్య, బోసుల శ్రీనివాస్, సురేష్ పటేల్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

● సీఎంఆర్ కేటాయింపులు త్వరగా పూర్తి చేయాలి

నిజామాబాద్ అర్బన్: సీఎంఆర్ ధాన్యం కేటాయింపులను త్వర త్వరగా పూర్తి చేయాలని బోధన్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి ఎఫ్‌సిఐ, రైస్‌మిల్లర్లు, సివిల్ సప్లై అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, ఇతర అధికారులతో కలిసి సీఎంఆర్ కేటాయింపుల విషయంపై సమీక్ష జరిపారు. ఎఫ్‌సిఐ వెంటవెంటనే ధాన్యాన్ని తీసుకుంటే గోదాంలు ఖాళీ అవుతాయని రైస్‌మిల్లర్లు కూడా 2023-24కు సంబంధించి సిఎంఆర్ కేటాయింపులను వెంటనే పూర్తిచేయాలన్నారు. వచ్చే అక్టోబర్‌నాటికి ఖరీఫ్ పంట అవకాశం ఉన్నందున అప్పటివరకు గోదాంలన్నీ ఖాళీగా ఉంచి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఎక్కడ కూడా రైతులకు నష్టం జరిగే చర్యలను ప్రభుత్వం ఉపేక్షించదని వెంట వెంటనే కేటాయించిన ధాన్యాన్ని ఎఫ్‌సీఐకి ఇవ్వాలని అదేవిధంగా సివిల్ సప్లై కార్పొరేషన్‌కు కూడా కేటాయించిన ధాన్యాన్ని వెంటవెంటనే ఎఫ్‌సీఐకి ఇవ్వాలన్నారు. ఈసమీక్ష లో రైస్‌మిల్లర్లు, ఎఫ్‌సీఐ, డిఎస్‌వో, డీఎం సివిల్‌సప్లై అధికారులు పాల్గొన్నారు.

● తాడ్‌బిలోలి లిఫ్ట్ పనులను ప్రారంభించాలి

రెంజల్: తాడ్‌బిలోలిలో సెకండ్ ఫేజ్ లిఫ్ట్ నిరుపయోగంగా ఉందని లిఫ్ట్ ఇరిగేషన్ పనులను ప్రారంభించాలని లిఫ్ట్ ఇరిగేషన్ ఛైర్మన్ మౌలానా శనివారం బోధన్ ఎమ్మెల్యేకి వినతిపత్రం అందజేశారు.

● టీచర్లలను కేటాయించిన పాఠశాలల్లో విధులు నిర్వహించాలి

బోధన్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహించే ఉపాధ్యాయులను తమకు కేటాయించిన పాఠశాలల్లో తప్పకుండా విధులు నిర్వహించాలని విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ ఉపాధ్యాయులపై ఆధారపడి ఉందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం బోధన్ పట్టణంలోని ఇరిగేషన్ గెస్ట్‌హౌస్‌లో పంచాయతీ రాజ్, ఇరిగేషన్ తదితర శాఖలతో సమీక్ష సమావేశం నిర్వహించారు, అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం అనేక విధాలుగా కృషి చేస్తుందన్నారు. ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించి కొంతమందికి డిప్యూటేషన్‌లపై గ్రామాలలో విధులు నిర్వహించాలని కేటాయించడం జరిగిందన్నారు. కొంతమంది ఉపాధ్యాయులు మారుమూల గ్రామాలకు వెళ్లి చదువులు చెప్పడం ఇష్టం లేనట్లు వ్యవహరిస్తున్నారని ఈ పద్ధతి సరైంది కాదన్నారు. ఎస్సీ కాలనీల్లో గ్రావెల్, మెటల్ రోడ్లు కావాల్సిన సౌకర్యాలు కల్పించాలన్నారు. రైస్‌మిల్లర్‌లు ప్రభుత్వానికి సహకరించాలన్నారు. ప్రభుత్వం అభివృద్ధికి అన్ని రకాలుగా కృషి చేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ చీల శంకర్, పట్టణ అధ్యక్షులు పాషా మొయినోద్దీన్, మండల అధ్యక్షులు నాగేశ్వర్ రావు, మందర్నా రవిలతో కౌన్సిలర్ శరత్ రెడ్డి, గుండెటి రాములు, తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి: గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థులకు కావలసిన మౌళిక వసతుల కల్పనకు కృషి చేస్తానని మాజీమంత్రి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం ఎడపల్లి గ్రామ శివారులో ఉన్న తెలంగాణ బాలికల గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలను మంచి విద్యావంతులుగా తీర్చి దిద్దాలనే సంకల్పంతో 20 ఏళ్ళ క్రిందట ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం బోధన్‌లో తెలంగాణ బాలికల గురుకల సొసైటీ పాఠశాలను 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు ఏర్పాటు చేసిందని, అక్కడ వసతులు సరిగా లేని కారణంగా నేను మంత్రిగా ఉన్న సమయంలో ఎడపల్లి గ్రామ శివారులోకి ఈ పాఠశాలను మార్చడం జరిగిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గడుగు గంగాధర్, నరాల రత్నాకర్, బిల్లా రాంమోహన్, ఎడపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పులి శ్రీనివాస్ రావు, బోధన్ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు సత్యనారాయణ, బొబ్బిలి శ్రీనివాస్, నాయకులు బంజ కామప్ప, ఎల్లయ్య యాదవ్, గంగా ప్రసాద్, పాల్ద భాస్కర్ రెడ్డి, రత్నాకర్ రెడ్డి, కృష్ణారావు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని వినతి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

సుభాష్‌నగర్, ఆగస్టు 31: నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నగర పాలక సంస్థ కమిషనర్ మంద మకరంద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నగరంలోని నగర పాలక సంస్థ కార్యాలయంలో మంద మకరంద్‌ను కలిసి ట్రాఫిక్ సమస్యలను విన్నవించారు. నగర పాలక సంస్థ ఏర్పడి 23 సంవత్సరాలు అవుతున్నా నేటికి రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓమయ్య అన్నారు. తోపుడు బండ్లకు సరైన సౌకర్యాలు కల్పించడంలో పాలక వర్గం విఫలమైందన్నారు. నగరంలోని గాంధీగంజ్, హమాల్‌వాడి, సుభాష్‌నగర్, పూలాంగ్, కోటగల్లిలలో కూరగాయల వ్యాపారులకు స్థలాన్ని కేటాయించి షెడ్లు నిర్మాణం చేసినా నిరుపయోగంగా మారాయని అన్నారు. ట్రాఫిక్ సమస్య లేకుండా వారిని షెడ్డులో వ్యాపారం చేసుకునేలా చూడాలన్నారు. గోశాల రోడ్ కమాన్ నుంచి దేవిరోడ్ వరకు కూరగాయలు అమ్ముతున్న వర్తకులను నగరంలోని వివిధ మార్కెట్‌లకు తరలించి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సలీమ్, ప్రసాద్, సాయిలు, అశోక్, నయీం, తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ పోర్టల్‌లో దరఖాస్తు తప్పనిసరి :ఎస్సై

ధర్పల్లి, ఆగస్టు 31: మండలంలో గణేష్ పండుగ సందర్భంగా ప్రతిష్టించే గణేష్ మండపాల సభ్యులు తమ మండపాల పేర్లను ఆన్‌లైన్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎస్సై రామకృష్ణ సూచించారు. శనివారం మండల కేంద్రంలో మండలంలోని వివిధ గ్రామాల్లోగల గణేష్ మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న మండపాలకే అనుమతి ఇవ్వడం జరుగుతుందని ఆయన చెప్పారు.గణేష్‌మండపాల వద్ద నిమజ్జనం జరిగేంతవరకు ముగ్గురు నుంచి ఐదుగురు సభ్యులు తెల్లవారుజామున వరకు ఉం డాలన్నారు. రాత్రి 10గంటలలోపు మైకులు, సౌండ్ సిస్టమ్‌లు నిలిపివేయాలన్నారు. మద్యం సేవించడం, పేకాట ఆడటం వంటివి చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.నిమజ్జనంసమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. ప్రశాంతంగా వినాయక చవితిని నిర్వహించేందుకు మండల ప్రజలు పోలీసులతో సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల మండపాల నిర్వహకులు పాల్గొన్నారు.

జియో టవర్ వద్దంటూ కాలనీవాసుల ఆందోళన



ధర్పల్లిలో ఆందోళనకు దిగిన కాలనీ వాసులు

ధర్పల్లి, ఆగస్టు 31: మండల కేంద్రంలోగల వేంకటేశ్వర టాకీస్ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న జియోటవర్‌ను వెంటనే పనులు ని లిపి వేయాలంటూ కాలనీవాసులు శనివారం ఆందో ళనకు దిగారు. జి యో టవర్ ఆధ్వర్యంలో టవర్ కోసం కేటాయించిన స్థలంలో పనులను ప్రారంభించగా కాలనీవాసులు అడ్డుకొని పనులను నిలిపివేయించారు. ఈ విషయంపై ధర్పల్లి ప్రత్యేక అధికారి బాలకృష్ణ, ఈవో సైఫొద్దీన్‌లకు కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు టవర్ నిర్మాణానికి అనుమతులను నిరాకరించినట్లు చెప్పారు.

గ్రంథాలయానికి పుస్తకాల అందజేత

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 31:జిల్లా కేంద్ర గ్రంథాలయానికి డాక్టర్ బి.ఎన్.రావు శనివారం పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకున్న యువత దేశానికి మానవ వనరులను అవేమన సంపద అన్నారు. సాంకేతిక నైపుణ్యం కొరత వల్ల ప్రభుత్వం, ప్రైవేటు రంగాల్లో 11కోట్ల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని కళాశాలల్లో అప్రెంటిషిప్, ఐటి కోర్సుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచాలన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ కవితరెడ్డి, డాక్టర్ సూరి, రాజ్‌కుమార్ సుబేదార్ పాల్గొన్నారు.

సమాచారశాఖ సీనియర్ అసిస్టెంట్‌కు వీడ్కోలు



నగరంలో రవూఫ్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 31: నిజామాబాద్ జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ (ఏఆర్ఈ) విభాగంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించి శనివారం ఉద్యోగ విరమణ చేసి ఎండి రవూఫ్‌కు ఆ శాఖ సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. దాదాపు 30 సంవత్సరాల పాటు ఆయన ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా సుభాష్‌నగర్‌లోని ఏఆర్ఈ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమంలో సిబ్బంది పూలమాలలు, శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా సమాచార శాఖలో ఆయన అందించిన సేవలను సహచర అధికారులు, సిబ్బంది కొనియాడారు. తన ఉద్యోగ నిర్వహణలో సహకరించిన ప్రతీ ఒక్కరికి రవూఫ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ సమాచార ఇంజనీర్ ఉమేష్‌చంద్రరావు, రిటైర్డ్ అధికారి రాములు, డీపీఆర్‌వో కార్యాలయ సిబ్బంది మాజీద్, బాలాజీ, హైమద్‌పాషా, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

లాడ్జి ఓనర్‌తో పాటు కౌన్సిలర్‌పై కేసు

బోధన్‌రూరల్,ఆగస్టు31: బోధన్ పట్టణంలోని స్వాగత్ లాడ్జిలో ఓ మహిళతో పట్టుబడ్డ బోధన్ పట్టణ బీఆర్ఎస్ పార్టీ 18వ వార్డు కౌన్సిలర్ బెంజరి గంగారాంతో పాటు స్వాగత్ లాడ్జి ఓనర్ మహ్మద్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐవీరయ్య తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కౌన్సిలర్‌కు మహిళ కుటుంబసభ్యులు దేహశుద్ధి చేయడంపై సుమోట కేసుగాకేసు నమోదు చేయడం జరిగిందన్నారు. బోధన్ పట్టణంలోని లాడ్జిలలో అసాంఘిక కార్యక్రమాలు జరిపిన, పాల్పడిన కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. లాడ్జిలో ఇతరులకు రూమ్‌లు కేటాయించినప్పుడు పూర్తిస్థాయి వివరాలు తీసుకోవాలన్నారు.బోధన్‌ఆర్డీవో ప్రొసిడింగ్ ద్వారా లాడ్జిలను ఎప్పటికప్పుడు తనిఖీలునిర్వహిస్తామన్నారు.పట్టణంలో అసాంఘిక,వ్యభిచార కార్యక్రమాలుజరుపుతున్నట్లు తమకుసమాచారం వచ్చిందని అలాంటి వాటిపై చర్యలు తీసుకుంటామన్నారు.

రైతులకు రుణాల పంపిణీ

వేల్పూర్, ఆగస్టు31: మండలంలోని రామన్నపేట్ గ్రామ సొసైటీలో పరిధిలో గ్రామాలకు చెందిన రైతులకు మంజూరైన రుణాలచెక్కులను సొసైటీ ఛైర్మన్‌జాగిరపు మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు మల్లేష్, కార్యదర్శిరణవీర్, సొసైటీడైరెక్టర్‌లు,సిబ్బంది పాల్గొన్నారు.

చెరువులో పడి ఒకరి మృతి

మోపాల్, ఆగస్టు 31: మండలంలోని నర్సింగ్‌పల్లి చెరువులో మారుతి (32) ప్రమాదవశాత్తు పడి మృతి చెందినట్లు శనివారం పోలీసులు తెలిపారు. డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్ గ్రామానికి చెందిన మారుతి తన బంధువు పెండ్లికి నర్సింగ్‌పల్లికి వచ్చాడు. కాల కృత్యాల కోసం వెళ్లిన మారుతి ప్రమాదవశాత్తుగా చెరువులో పడి మృతి చెందాడని స్థానికులు తెలిపారు. శుభకార్యానికి వచ్చిన మారుతి మరణించడంతో వారి కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బాలికపై అత్యాచారానికియత్నించిన వ్యక్తిపై కేసు

ఖిల్లా, ఆగస్టు31:నగరంలోని రెండో టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో పదేళ్లబాలికతో అసభ్యకరంగా ప్రవర్తించడమే కాకుండా అత్యాచార యత్నం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యాసర్‌అరాఫత్ తెలిపారు.ఈఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. బాలిక శుక్రవారం సాయంత్రం అదే ప్రాంతంలో ఉన్న కిరాణషాప్‌కు వెళ్లి వస్తుండగా ఓవ్యక్తి అత్యాచారయత్నం చేశాడు. ఈ విషయాన్ని బాలిక కుటుంబసభ్యులకు తెలుపగా కుటుంబసభ్యులు బాసిద్ అనే వ్యక్తిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పోలీసులు సదరు వ్యక్తిపై కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

యువతి అదృశ్యం

నవీపేట,ఆగస్టు31: నిజామాబాద్ మండలం పాల్దాకు చెందిన ఒడ్డెపల్లి సింధూజ అనే 19సంవత్సరాల యువతి అదృశ్యమైందని ఎస్ఐ వినయ్ తెలిపారు. 15రోజుల క్రితం హైదరాబాద్‌లో ఉద్యోగం సంపాదించుకుంటానని వెళ్లిన ఆమె ఇంటికి సమాచారం అందించలేదని అన్నారు. ప్రస్తుతం ఆమె ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుందని, తల్లి సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆటో దొంగ అరెస్టు

ఖిల్లా, ఆగస్టు 31 : నగరంలోని కంఠేశ్వర్ ప్రాంతంలో గురువారం రాత్రి ఇంటి ముందు నుంచి అపహరణకు గురైన ఆటో దొంగను అరెస్టు చేసినట్లు మూడవ టౌన్ ఎస్ఐ మహేష్ తెలిపారు. కంఠేశ్వర్‌కు చెందిన మహ్మద్ ఇమ్రాన్ తన ఆటోను ఇంటి ఎదుట నుంచి గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆ ప్రాంతంలో సీసీఫుటేజీలను పరిశీలించగా మహారాష్ట్రకు చెందిన బాలాజీగా గుర్తించారు. బాలాజీని అదుపులోకి తీసుకుని, ఆటోను స్వాధీనం చేసి కేసునమోదు చేశామన్నారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.85	రూ.200	రూ. 220
వెన్‌కాబ్(కిలో)	రూ.95	రూ.205	రూ. 225

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.74200	రూ.68,450	రూ.890

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : తంగలాన్ (11.50)
: సరిపోదా శనివారం (3.10, 6.45, 10.20)
స్క్రీన్-2 : స్త్రీ-2 (హిందీ) (12.15, 3.30, 6.45, 10.00)
స్క్రీన్-3 : కాలం రాసిన కథలు (10.15)
: కమిటీ కుర్రాళ్లు (1.10, 10.45)
: నేను కీర్తన (4.25)
: ఆయ్ మేం ఫ్రెండ్స్ అండి (7.40)
స్క్రీన్-4 : సీతారాం సిత్రాలు (10.10)
: సరిపోదా శనివారం (12.30)
: తంగలాన్ (4.05)
: డిమోంటి కాలనీ-2 (7.25, 10.35)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : సరిపోదా శనివారం (1.00, 4.10, 7.20, 10.30)
స్క్రీన్-2 : ఆయ్ మేం ఫ్రెండ్స్ అండి (10.20)
: కమిటీ కుర్రాళ్లు (1.30, 7.30)
: తంగలాన్ (4.30, 10.20)
స్క్రీన్-3 : స్త్రీ-2 (హిందీ) (10.20, 7.20)
: డిమోంటి కాలనీ-2 (1.30)
: ఆయ్ మేం ఫ్రెండ్స్ అండి (4.30)
: గబ్బర్‌సింగ్ (10.10)

దేవి : తంగలాన్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : కమిటీ కుర్రాళ్లు (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : మిస్టర్ బచ్చన్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్ : సరిపోదా శనివారం (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్